పసిడి, చమురు పైపైకే..

వచ్చే ఏడాది డిసెంబర్‌లో ఔన్స్ బంగారం 3,150 డాలర్లకు

బ్యారెల్ చమురు ధర 100 డాలర్లకు • గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా • ఎగదోయనున్న ఆందోళనకర పరిస్థితులు

న్యూఢిల్లీ, నవంబర్ 27: అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం, ముడి చమురు ధరలు వచ్చే ఏడాది ఆఖరుకల్లా భారీగా పెరుగవచ్చని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేస్తున్నది. ఈ క్రమంలోనే ఔన్స్ పసిడి విలువ 2025 డిసెంబర్ నాటికి ఏకంగా 3,150 డాలర్లను తాకవచ్చని చెప్తున్నది. ఇది ప్రస్తుతంతో పోల్చితే 19 శాతం ఎక్కువ కావడం గమనార్హం. గ్లోబల్ మార్కెట్‌లో ఇప్పుడు ఔన్స్ 2,550 డాలర్ల వద్ద ఉన్నది. అలాగే బ్యారెల్ క్రూడాయిల్ రేటు 100 డాలర్లకు చేరవచ్చని అంటున్నది. ఇప్పుడిది 70 డాలర్ల సమీపంలో కదలాడుతున్నది.

ఇదీ సంగతి..

ప్రపంచవ్యాప్తంగా నెలకొనే ప్రతికూల పరిస్థితులు.. ఓవైపు మదుపరులను, మరోవైపు డిమాండ్‌ను ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సురక్షిత మదుపు సాధనమైన బంగారంతోనే తమ పెట్టుబడులకు రక్షణ అని మెజారిటీ ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. అందుకే ద్రవ్యోల్బణం పెరుగుతున్నా, స్టాక్ మార్కెట్లు పతనమవుతున్నా, యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నా, అధికారాలు మారి వ్యాపార-వాణిజ్య పరిస్థితులు దిగజారినా.. వెంటనే పెట్టుబడులను గోల్డ్ వైపునకు మళ్లిస్తున్నారు. వచ్చే ఏడాదిలో ఇలాంటి ఘటనలకు ఎక్కువగానే ఆస్కారముందని, పుత్తడి ధరలు ఆల్‌టైమ్ హైల్లోకి చేరడం ఖాయమన్న అభిప్రాయాలు గట్టిగా వ్యక్తమవుతున్నాయిప్పుడు. ఇక పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్తతలు క్రూడాయిల్ ధరల్ని సహజంగానే ఎగదోస్తాయి. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఇబ్బందికర వాతావరణం తప్పక ముడి చమురును ఖరీదెక్కిస్తుందని అంటున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, దీనిపై ఐరోపా దేశాల వైఖరి, డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలో అమెరికా తీసుకునే నిర్ణయాలు, చైనాతో సుంకాల పోరు ఇలా అనేకాంశాలతో క్రూడ్ సెంచరీ కొడుతుందన్న అంచనాలు పుష్కలంగా వస్తున్నాయి.

అమెరికానే కేంద్ర బిందువు

అటు బంగారం కావచ్చు, ఇటు ముడి చమురు కావచ్చు.. ఈ రెండు కమోడిటీ మార్కెట్లను అమితంగా ప్రభావితం చేస్తున్నది అమెరికా ప్రభుత్వ నిర్ణయాలు, ఆ దేశ ఆర్థిక పరిస్థితులే. వచ్చే ఏడాది జనవరిలో అగ్రరాజ్యంలో అధికార మార్పిడి జరుగనున్నది. ట్రంప్ అధ్యక్షుడు కానున్నారు. దీంతో ట్రంప్ దుందుడుకు వైఖరి, ఇప్పటికే బలహీనంగా ఉన్న అమెరికా ఆర్థిక వ్యవస్థ.. గోల్డ్, క్రూడ్ రేట్లను అమాంతం పెంచేస్తాయన్న అంచనాల్ని గోల్డ్‌మన్ సాచ్స్ వేస్తున్నది. ద్రవ్యోల్బణం భయాలు, ఆర్థిక ఇబ్బందులు గోల్డ్ ఈటీఎఫ్‌లకు డిమాండ్‌ను పెంచుతాయని, ముఖ్యంగా అమెరికా రుణ భారం.. అమెరికాసహా అన్ని దేశాల సెంట్రల్ బ్యాంకులను బంగారం కొనుగోళ్లకు ఉసిగొల్పవచ్చని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ఇక ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లు.. బాండ్, స్టాక్ మార్కెట్లను ఎక్కువగా ప్రభావితం చేస్తాయన్నది తెలిసిందే. దీంతో విదేశీ మదుపరుల పెట్టుబడుల తీరు కూడా ఇక్కడ ప్రధానం కానున్నది.

పెరిగిన బంగారం ధర

వరుసగా రెండు రోజులు భారీగా పతనమైన బంగారం ధరలు బుధవారం కోలుకున్నాయి. హైదరాబాద్‌లో తులం 24 క్యారెట్ రేటు రూ.270 పెరిగి రూ.77,510గా ఉన్నది. సోమ, మంగళవారాల్లో రూ.24,00 పడిపోయిన విషయం తెలిసిందే. 22 క్యారెట్ రూ.250 అందుకుని రూ.71,050 వద్ద నిలిచింది. ఇక ఢిల్లీలో 10 గ్రాములు 24 క్యారెట్ పుత్తడి విలువ రూ.650 పుంజుకొని రూ.78,800 పలికింది. కాగా, వెండి ధరల విషయానికొస్తే.. ఈ ఒక్కరోజే కిలో రూ.5,200 ఎగబాకి రూ.95,800లకు చేరింది. అంతర్జాతీయంగా అనుకూల పరిస్థితులు, స్థానిక జ్యుయెల్లర్స్ నుంచి పెరిగిన డిమాండే కారణం.

ధరల పెరుగుదలకు కారణాలు

- విజృంభిస్తున్న ద్రవ్యోల్బణం
- స్టాక్ మార్కెట్లలో ఒడిదొడుకులు
- పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు
- సెంట్రల్ బ్యాంకుల నుంచి బంగారానికి అధిక డిమాండ్
- అమెరికాలో ఆర్థిక అస్థిరతలు
- పరస్పర సుంకాలు-వాణిజ్య యుద్ధాలు
- ఆయా దేశాల జీడీపీ అంచనాలు

ఎలక్ట్రిక్ యాక్టివా వచ్చేసింది..

సింగిల్ చార్జింగ్‌తో 102 కిలోమీటర్లు • జనవరి 1 నుంచి బుకింగ్ స్టార్ట్

బెంగళూరు, నవంబర్ 27: ఎట్టకేలకు యాక్టివా ఈ-స్కూటర్ మార్కెట్లోకి అందుబాటులోకి రాబోతున్నది. దేశవ్యాప్తంగా ఈ-స్కూటర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని హోండా మోటర్‌సైకిల్ గతంలోనే యాక్టివాను ఈ-స్కూటర్ రూపంలో విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. జనవరి 1 నుంచి ఈ-స్కూటర్ కోసం బుకింగ్‌లు ఆరంభించనున్న సంస్థ..ఫిబ్రవరి నుంచి డెలివరీ చేయనున్నట్లు ప్రకటించింది. ఇందుకు సంబంధించి బెంగళూరు వేదికగా రెండు రకాలుగా ఈ-స్కూటర్లను ప్రదర్శించింది. యాక్టివా ఈ, క్యూసీ1 పేర్లతో వీటిని విడుదల చేసింది. ధర వివరాలు మాత్రం సంస్థ వెల్లడించలేదు. ఈ సందర్భంగా హోండా

మోటర్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా ఎండీ, సీఈవో త్సుత్సుము ఓటాని మాట్లాడుతూ..ఎలక్ట్రిక్ విభాగంలో ఇదొక మైలురాయి వంటిదని, దేశీయ బెస్ట్ ఈవీ ఏకోసిస్టమ్‌ను తయారు చేయడానికి చాలా సమయం పట్టిందన్నారు.

ఈ-యాక్టివా ప్రత్యేకతలు

- 1.5 కిలోవాట్ కెపాసిటీ కలిగిన రెండు బ్యాటరీలు ఇవ్వనున్నది
- సింగిల్ చార్జింగ్‌తో 102 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.
- 80 శాతం బ్యాటరీ చార్జింగ్ కావడానికి 4.30 గంటలు, 6.50 గంటల్లో పూర్తిస్థాయిలో చార్జింగ్ కానున్నది.
- గంటకు 50 కిలోమీటర్లు ప్రయాణించే ఈ స్కూటర్‌లో ఎల్‌ఈడీ లైటింగ్, 7.0 అంగుళాల టీఎఫ్‌టీ స్క్రీన్, రోడ్‌సైన్ డ్యూయో యాప్‌తో కనెక్ట్ చేసుకోవచ్చును.



ఒత్తిడిలో పౌల్ట్రీ పరిశ్రమ

- **కేంద్రప్రభుత్వం చేయూతనివ్వాలి**
- **పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ డిమాండ్**

మాదాపూర్, నవంబర్ 27: దేశ ఆహార భద్రత, గ్రామీణ ఉపాధికి కీలకంగా ఉన్న పౌల్ట్రీ పరిశ్రమ ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిలో ఉన్నదని పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ అన్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్ 16వ ఎడిషన్‌ను ఐపీఈఎంఏతో కలిసి నిర్వహిస్తున్నారు. మూడు రోజుల ఈ ఎగ్జిబిషన్ బుధవారం మొదలైంది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉదయ్ సింగ్ మాట్లాడుతూ.. ఏటా దేశ జీడీపీకి రూ.1.35 లక్షల కోట్ల సహకారాన్ని పౌల్ట్రీ ఇండస్ట్రీ అందిస్తున్నదన్నారు. లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల్నీ కల్పిస్తున్నదని, అలాంటి ఈ పరిశ్రమ.. ముడిసరుకు వ్యయాలు పెరగడం వల్ల కుదేలవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కజొన్న, సోయా వంటి దాణా ఉత్పత్తులతోపాటు పౌల్ట్రీ ఇండస్ట్రీ పరికరాలపై జీఎస్టీ భారం పెరిగిపోయిందని, దీన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. రుణ లభ్యతనూ పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారందాకా కొనసాగనున్న ఈ ఎక్స్‌పోకు 40 వేలకుపైగా సందర్శకులు వస్తారని అంచనా.

తెలంగాణతో దోస్తీకి బల్గేరియా ఆసక్తి

హైదరాబాద్, నవంబర్ 27(నమస్తే తెలంగాణ): తెలంగాణతో వాణిజ్య, సాంస్కృతిక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలు నెలకొల్పేందుకు బల్గేరియా ఆసక్తితో ఉన్నదని భారత్‌లో ఆ దేశ రాయబారి డా.నికోలాయ్ యాంకోవ్ వెల్లడించారు. బుధవారం ఆయన సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య, పారిశ్రామిక పెట్టుబడులకు సంబంధించి ఒక కామన్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను మంత్రి అంగీకరించారు. నూతన ఆవిష్కరణలు, ఫార్మా, లైఫ్‌సైన్సెస్‌లో తమ రాష్ట్రంలో అద్భుతమైన ఎకోసిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని శ్రీధర్ బాబు ఆయనకు వివరించారు. త్వరలో ఇరు దేశాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చలు జరిపాలని శ్రీధర్ బాబు చేసిన ప్రతిపాదనకు యాంకోవ్ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఆ దేశపు గౌరవ కాన్సులేట్, సుచిర్ ఇండియా ఇన్‌ఫ్రా సీఈవో డా.కిరణ్ కుమార్ హాజరయ్యారు.

మళ్లీ 80 వేలపైకి సెన్సెక్స్

230 పాయింట్లు పెరిగిన సూచీ



ముంబై, నవంబర్ 27: దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ లాభాల్లోకి వచ్చాయి. గత కొన్నిరోజులుగా భారీగా నష్టపోయిన అదానీ గ్రూపు షేర్లు తిరిగి లాభాల్లోకి రావడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడంతో సూచీలు తిరిగి లాభాల్లోకి రాగలిగాయి. ఇంట్రాడేలో 500 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 230.02 పాయింట్లు అందుకొని తిరిగి 80 వేల పైకి 80,234.08కు చేరుకున్నది. మరో సూచీ నిఫ్టీ సైతం 80.40 పాయింట్లు అందుకొని 24,274.90 వద్ద నిలిచింది. 24,354 గరిష్ఠ స్థాయి నుంచి 24,145 కనిష్ఠ స్థాయిలో కదలాడిన నిఫ్టీ చివరకు 80 పాయింట్లకు పైగా లాభపడింది. మధ్యాహ్నం వరకు తీవ్ర ఊగిసలాటలో కదలాడిన సూచీలకు ఆ తర్వాత అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు జోష్ పెంచాయి. ఫలితంగా భారీ లాభాలవైపు కదంతొక్కాయి. కొన్ని బ్లూచిప్ సంస్థలు నష్టాల్లోకి జారుకోవడం వల్ల భారీ లాభాలు నిలుపుకోలేకపోయాయి.

కోలుకున్న అదానీ గ్రూపు షేర్లు

అమెరికా విదేశీ అవినీతి పద్ధతుల చట్టం ప్రకారం గౌతమ్ అదానీపై ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశాలు లేవని అదానీ గ్రూపు స్పష్టంచేయడంతో ఈ గ్రూపు షేర్లు భారీగా పుంజుకున్నాయి. బుధవారం అదానీ టోటల్ గ్యాస్, అదానీ పవర్ షేర్లు అత్యధికంగా 20 శాతం వరకు లాభపడ్డాయి. వీటితోపాటు అదానీ ఎంటర్‌ప్రైజెస్ 11.56 శాతం, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 10 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 10 శాతం, ఎన్‌డీటీవీ 9.35 శాతం, అదానీ విల్మార్ 8.46 శాతం, అదానీ పోర్ట్స్ 6.29 శాతం, సంఘీ ఇండస్ట్రీస్ 4.73 శాతం, అంబుజా సిమెంట్ 4.40 శాతం, ఏసీసీ 4.16 శాతం లాభపడ్డాయి. దీంతో అదానీ గ్రూపు సూచీల ర్యాలీతో మొత్తం మార్కెట్ విలువ రూ.1,24,693.19 కోట్లు పెరిగింది. వీటిలో అదానీ పవర్, అదానీ ఎనర్జీ, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్ అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి.

- ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, మారుతి షేర్లు లాభపడ్డాయి.
- టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూస్టీల్, హెచ్‌యూఎల్, బజాజ్‌ఫైనాన్స్, నెస్లె, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా మోటర్స్, ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్, టాటాస్టీల్, ఎయిర్‌టెల్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- కానీ, టైటాన్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎస్బీఐ, సన్‌ఫార్మా, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ఐసీఐసీఐ షేర్లు నష్టపోయాయి.

టెల్కోల అప్పు 4 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, నవంబర్ 27: దేశీయ టెలికం సంస్థలు రుణాలతో సతమతమవుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరం చివరినాటికి నాలుగు టెలికం సంస్థల అప్పు రూ.4,09,905 కోట్లుగా ఉన్నట్లు పార్లమెంట్‌కు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వొడాఫోన్ ఐడియా అత్యధికంగా రూ.2.07 లక్షల కోట్లు రుణం ఉండగా, భారతీ ఎయిర్‌టెల్ రూ.1.25 లక్షల కోట్లు, జియోకు రూ.52,740 కోట్లు, బీఎస్‌ఎన్‌ఎల్ అప్పు రూ.28,092 కోట్లుగా ఉన్నట్లు చెప్పారు. 2021-22లో బీఎస్‌ఎన్‌ఎల్‌కు రూ.40,400 కోట్ల రుణం ఉంది.

రైస్ మిల్లుల్లో ధాన్యం దోపిడీని అరికట్టాలి

బీఆర్‌ఎస్ 11వ వార్డు అధ్యక్షుడు కుమార్‌యాదవ్

కృష్ణకాలనీ, నవంబర్ 27: ధాన్యంలో కటింగ్‌ల పేరుతో మిల్లర్లు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని బీఆర్‌ఎస్ 11వ వార్డు అధ్యక్షుడు దుండ్ర కుమార్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోళ్లలో ఒక్క కిలో కూడా కోత విధించొద్దని ప్రభుత్వం చెప్తున్నా క్వింటాల్‌కు 6 నుంచి 10 కిలోల వరకు కటింగ్ చేస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్, సివిల్ సప్లయ్ అధికారులు ప్రత్యేక చొరవ చూపి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

విద్యా వ్యవస్థలో మార్పు తీసుకురావాలి

కాటారం, నవంబర్ 27 : రాష్ట్రంలో రోజురోజుకూ ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ కేసులు పెరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్ ఆరోపించారు. మండలకేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థిని చనిపోయిన ఘటనపై కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే రాష్ట్రంలో విద్యా వ్యవస్థపై ముఖ్యమంత్రి రివ్యూ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫుడ్ పాయిజన్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. లేకపోతే ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ కమిటీ సభ్యులు రమ్య, దివ్య, మహేశ్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

గణపురం, నవంబర్ 27 : మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు పెరుమాండ్ల కుమారస్వామిగౌడ్ అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం గీతా పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు మాదాసు రవి, మాజీ సర్పంచ్ నారగాని దేవేందర్‌గౌడ్, నాయకులు తాళ్లపెల్లి యాదగిరిగౌడ్, మామిండ్ల మల్లికార్జున్‌గౌడ్, రావుల అశోక్, మార్క కుమార్, మాదాసు మొగిలి పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యం చేతి పుస్తకం ఆవిష్కరణ

భూపాలపల్లి రూరల్, నవంబర్ 27: వైద్య ఆరోగ్య శాఖ తయారు చేసిన ప్రజా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం చేతి పుస్తకాన్ని కలెక్టర్ రాహుల్‌శర్మ బుధవారం తన చాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వైద్యులు, ఎంవోలకు, ప్రోగ్రాం అధికారులకు ఈ పుస్తకం మార్గ నిర్దేశంగా ఉపయోగ పడుతుందన్నారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో మధుసూదన్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

మహాముత్తారం, నవంబర్ 27 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని అదనపు కలెక్టర్ పీ అశోక్‌కుమార్ నిర్వాహకులకు సూచించారు. బుధవారం ఆయన మండలంలోని కోనంపేట, మినాజీపేట ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి మ్యాచర్ మీటర్ ద్వారా ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. ధాన్యాన్ని విక్రయించే ముందు తాలు, చెత్త, రాళ్లు లేకుండా శుభ్రం చేయాలని రైతులకు సూచించారు. కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని తెలిపారు. ఆయన వెంట డీఎస్‌వో శ్రీనాథ్, తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు, రైతులు ఉన్నారు.

పశుగణనను పరిశీలించిన జిల్లా నోడల్ అధికారి

కాటారం, నవంబర్ 27 : అఖిల భారత పశుగణనలో భాగంగా కాటారంలో జరుగుతున్న పశుగణనను జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వెంకన్న బుధవారం పరిశీలించారు. పశువుల లెక్కింపు విధానాన్ని, మొబైల్‌లో డేటా నమోదు విధానాన్ని తనిఖీ చేశారు. పశుగణనపై సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. డాక్టర్ ధీరజ్, సూపర్‌వైజర్ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పదిలో నూరుశాతం ఫలితాలు సాధించాలి

వెంకటాపురం(నూగూరు), నవంబర్ 27 : పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీనగరం బాలుర ఆశ్రమ పాఠశాలల, చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో పాత భవనాల నుంచి తరగతి గదులను కొత్త భవనంలోకి మార్చాలని సూచించారు. భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

కోల్ ఇండియా పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించాలి

సింగరేణి భూపాలపల్లి జీఎం రాజేశ్వర్‌రెడ్డి

భూపాలపల్లి రూరల్, నవంబర్ 27 : జరుగబోయే కోల్ ఇండియా పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించాలని సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. భూపాలపల్లి ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్, గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా కంపెనీ లెవెల్ క్యారమ్, చెస్ క్రీడా పోటీలు కృష్ణకాలనీ మినీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించగా బుధవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జీఎం హాజరై గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కోల్ ఇండియా పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించి సింగరేణి విజయ పతాకం రెపరెపలాడేలా కృషి చేయాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో డీవైపీఎం రాజు, ఎస్‌ఆర్ పీవో శ్రావణ్ కుమార్, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ విజేందర్, ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ మెంబర్ పసునూటి రాజేందర్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ తిరుమల్, జనరల్ కెప్టెన్ పాక శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు ఇస్తున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

పీహెచ్‌సీ ఏర్పాటుకు స్థలం గుర్తింపు

ములుగురూరల్, నవంబర్ 27 : మల్లంపల్లి గ్రామంలోని సర్వే నంబర్1896లో 10 గుంటల భూమిని బుధవారం డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, ఆర్ఐ విజేందర్, జీపీ కార్యదర్శి రాజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి గుర్తించారు. అనంతరం ఆయన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ నిర్మాణానికి రూ.3కోట్ల అంచనాతో అధికారులకు నివేదిక పంపించినట్లు తెలిపారు. ఆయన వెంట ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణ్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

'మాలల సింహగర్జన'ను విజయవంతం చేయాలి

మంగపేట, నవంబర్ 27 : డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాల కులపెద్దలు గులగట్టు విజయరావు, గోలి రామమనోహర్‌రావులు పిలుపునిచ్చారు. మండలంలోని కమలాపురంలో మాల కుల పెద్దల ఆధ్వర్యంలో సింహగర్జన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. సమావేశంలో మేడిపల్లి శశికుమార్, గోలి విజయశేఖర్, తొగరు రమేశ్, నరేశ్, కాంతారావు, సమ్మయ్య, వసంత్, తిరుపతి, సిద్ధార్థ్, రాజయ్య, ముత్యాలు, రాములు పాల్గొన్నారు.

రేగులగూడెం పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

మంగపేట, నవంబర్ 27 : మండలంలోని రేగులగూడెం పాఠశాలను బుధవారం ఎంఈవో మేనక తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులు క్రమశిక్షణలో అభ్యసించాలని ఆమె సూచించారు.

జర్నలిస్టుపై కేసు నమోదు

గోవిందరావుపేట, నవంబర్ 27 : కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు మేరకు ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా పోలీస్ స్టేషన్‌లో జర్నలిస్టుపై కేసు నమోదైంది. ఈ విషయం ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంత్రి సీతక్కతో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌పై సిగ్నల్ టీవీ జర్నలిస్టు శివారెడ్డి దీన్‌దయాళ్ నిధుల విషయమై యూట్యూబ్‌లో సెప్టెంబర్ మాసంలో కథనం ప్రసారం చేశాడు. తప్పుడు కథనాలు ప్రసారం చేస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రసపుత్ సీతారాంనాయక్ సెప్టెంబర్ 10న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, శివారెడ్డిపై నమోదైన కేసును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు సంఘం, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఏ రమణకుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ప్రజాపాలన విజయోత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర

ములుగురూరల్, నవంబర్ 27 : ములుగు జిల్లా కేంద్రంలోని డీఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 29న నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ దివాకర అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావుతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. డీఎల్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని అన్నారు. సమావేశంలో డీఈవో పాణిని, డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, ముఖ్య ప్రణాళిక అధికారి ప్రకాశ్, డీడబ్ల్యూవో శిరీష, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీపీఆర్వో రఫిక్, తహసీల్దార్ విజయ్‌భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

బాలల హక్కులపై అవగాహన

గోవిందరావుపేట/ఏటూరునాగారం/వాజేడు/మంగపేట/కృష్ణకాలనీ, నవంబర్ 27 : గోవిందరావుపేట మండలం చల్వాయి కేజీబీవీ పాఠశాల, ఏటూరునాగారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలల హక్కులపై బుధవారం అవగాహన కల్పించారు. గోవిందరావుపేటలో చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి జే ఓంకార్, ఏటూరునాగారంలో జీసీడీవో రమాదేవి, వాజేడు మండలం జంగాలపల్లి కేజీబీవీలో బాలల పరిరక్షణ అధికారి ఎన్ హరికృష్ణ బాల్య వివాహాల నిరోధక చట్టం 2006పై, చైల్డ్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 1098పై విద్యార్థులకు వివరించారు. అలాగే మంగపేట కేజీబీవీని జీసీడీవో రమాదేవి తనిఖీ చేశారు. చల్వాయిలో పాఠశాల ఎస్‌వో వెంకటలక్ష్మి, సోషల్ వర్కర్ జ్యోతి, చైల్డ్ హెల్ప్ లైన్ నాగమణి, ఏటూరునాగారంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి అరుణ, పరిరక్షణ అధికారి హరికృష్ణ, సోషల్ వర్కర్ సుమన్, వాజేడులో జిల్లా బాలల పరిరక్షణ వాజేడు మండల ఇన్‌చార్జి కే సుమన్, కరాటే కోచ్ గొంది హనుమంతు, సీఆర్టీలు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే, భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్‌లో సహాయ వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ, జిల్లా బాలల పరిరక్షణ శాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకటస్వామి, గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి శైలజ హాజరై బాలల హక్కులపై అవగాహన కల్పించారు. సహాయ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి వంగ రాజకమల్‌రెడ్డి, సఖీ కేంద్రం నిర్వాహకురాలు గాయత్రి, ఆయా విభాగాల సిబ్బంది తమిశెట్టి స్వప్న, సామల శ్రీలత, కోమల, అశోక్, ఆలూరి సరిత పాల్గొన్నారు.

రైతు బీమా పెండింగ్ క్లెయిమ్‌లు అప్‌లోడ్ చేయాలి

ఏటూరునాగారం, నవంబర్ 27 : రైతు బీమా పెండింగ్ క్లయిమ్‌లను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి తేజోవతి ఏఈవోలను ఆదేశించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం డివిజన్ సమీక్షా సమావేశాన్ని ఏడీఏ అవినాష్‌వర్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. సమావేశంలో ఆయా మండలాల ఏవోలు వేణుగోపాల్, చేరాలు, జితేందర్‌రెడ్డి, శ్రీధర్, మహేశ్, నవీన్, ఏడు మండలాల్లో వివిధ వ్యవసాయ క్లస్టర్లకు చెందిన వ్యవసాయ విస్తీర్ణాధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉపాధ్యాయులకు కనీస వేతనం చెల్లించాలి

ఏటూరునాగారం, నవంబర్ 27 : కేజీబీవీ ఉపాధ్యాయులకు కనీస వేతనం చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోడెం సమ్మయ్య కోరారు. పాఠశాల ఆవరణలో భోజన విరామ సమయంలో పలువురు ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీ ఉపాధ్యాయ సిబ్బందికి మినిమమ్ బేసిక్ పే చెల్లించాలని కోరారు. సర్వీస్ రెగ్యులర్ చేసి, హెల్త్ కార్డులు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏటూరునాగారం మండల అధ్యక్షుడు పత్రి కిరణ్, మండల నాయకులు సంతోష్, ఉపాధ్యాయులు అరుణ, హరిత, శ్రీదేవి, స్వరూప, విజయ, రమ్యకృష్ణ, మమత, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

గణపురం, నవంబర్ 27 : మండలంలోని చెల్పూర్ పరిధి కుందూరుపల్లిలో బుధవారం దివంగత వంగ వెంకటమ్మ, దుర్గయ్య స్మారకార్థం బుధవాం ఉచిత కంటి వైద్య శిబిరం పరకాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామానికి చెందిన 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 25 మందికి కంటి ఆపరేషన్ ఉచితంగా చేయనున్నట్లు నిర్వాహకులు వంగ కుమారస్వామి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆప్తమిక్ గుంటోజు వెంకన్న, ఆల్లం శ్రవణ్, శెట్టి రవి, రమేశ్ పాల్గొన్నారు.

ఇసుక లారీలను నియంత్రించాలి

ములుగురూరల్, నవంబర్ 27 : ఇసుక లారీలను నియంత్రించాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోవింద్‌నాయక్ అన్నారు. బుధవారం ఆయన ములుగులో మాట్లాడుతూ ఇసుక లారీలతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక లారీలపై మాట్లాడిన ప్రస్తుత మంత్రి సీతక్క లారీల నియంత్రణకు అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధక్షుడు పాలెపు శ్రీనివాస్, నాయకులు సానికొమ్ము ఆదిరెడ్డి, గజ్జి నగేశ్, భూక్య అమర్‌సింగ్, తప్పెట్ల గణపతి తదితరులు పాల్గొన్నారు.